క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డపాడు యువజన సంఘం (బీవైఎస్) 69వ వార్షికోత్సవాన్ని ఈనెల 12వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలియజేశారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న అమరవీరుల స్మారక మందిరం వద్ద వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘానికి, శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ ఉద్యమానికి విశేషమైన సంబంధం ఉందన్నారు. సంఘంలో పనిచేసిన ఎంతోమంది యువకులు నాటి శ్రీకాకుళ పోరాటంలో అశువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, కార్యదర్శి బొడ్డు యుగంధర్, గుజ్జు దశరథరావు, తామాడ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

మందస: ఆశ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు సూచించారు. మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలు ఆశ కార్యకర్తలకే బాగా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు టి.లీలారాణి, పీహెచ్ఎన్ ఎస్.పెంటమ్మ, హెచ్‌వీ సుజాత, ఎల్డీ వైసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

ఇచ్ఛాపురం రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేవతి భేరి అన్నారు. పీహెచ్‌సీలో 21 సంవత్సరాలు పనిచేసి హెచ్‌వీగా బదిలీపై రాజపురం వెళ్లిన జె.భారతమ్మను, 12 ఏళ్లుగా స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహించి బదిలీపై కంచిలి వెళ్లిన టి.సుజాతలను ఆస్పత్రి ఆవరణలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్.దానమ్మ, ఎంపీహెచ్ఈవో పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిరాజ్ పరామర్శ

కవిటి: మండలంలోని దూగానపుట్టుగ సర్పంచ్ దూగాన భద్రాచలం తల్లి డి.సరోజిని ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ సోమవారం పరామర్శించారు. అలాగే బెజ్జిపుట్టుగకు చెందిన పొందల లోకేష్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బొరివంకలో ఇటీవల మరణించిన బల్లెడ ప్రీతం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు బెందాళం శ్రీరాంప్రసాద్, పూడి నీలాచలం, పూడి నేతాజీ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి గ్రామానికి చెందిన సాసుమాను మోహన్‌రావు వరి కుప్పలు ఇటీవల దగ్ధమైన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబానికి సర్పంచ్ బొచ్చ రాజేశ్వరి రూ.10 ఆర్థిక సాయం మంత్రి సీదిరి అప్పలరాజు చేతులమీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, జెడ్పీటీసీ మచ్చ ధనరాజురత్నాలు, పీసీఎంఏ అధ్యక్షుడు పైల వెంకటరావు, ప్రభుత్వ విప్ గండు మోహనరావు, బొత్స షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాశీబుగ్గ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమాజానికి యువతరం చాలా అవసరమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, అందరూ చక్కగా చదువుకొని స్థిరపడాలని సూచించారు. విద్యార్థుల చదువులపై రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారిస్తోందని తెలియజేశారు. బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు సమాచారం అందించాలని కోరారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

ఇచ్ఛాపురం రూరల్: రానున్న ఉగాది నాటికి త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో కె.రామారావు సూచించారు. గృహ నిర్మాణ శాఖ డీఈ రామకృష్ణతో కలసి ఈదుపురం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు సోమవారం అవగాహన కల్పించారు. సకాలంలో బిల్లులు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. వారితో పాటు వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కవిటి: రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్ఐ కె.రాము అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్స్‌పై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నరసింహకుమార్‌దాస్, జిణగ పాపారావు అధ్యాపకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

వజ్రపుకొత్తూరు: జీడిలో పూత దశలో యాజమాన్య పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చని సచివాలయ ఉద్యానవన సహాయకుడు కె.సందీప్ అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురంలో తోటబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడి మామిడిలో యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

పారదర్శకతకు పెద్దపీట



సంతబొమ్మాళి: సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- ఉద్దండపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సంతబొమ్మాళి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాల తలగాం పంచాయతీ ఉద్దండపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఎవరికైనా సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే తెలియజేయాలని సూచించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కార చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, పీఏసీఎస్ చైర్మన్ కె.జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె సతీష్, ఎం.అప్పారావు, ఎస్.భీమారావు, పి.రామకృష్ణ, అట్టాల అప్పలనాయుడు, ఎన్ని మన్మథరావు, ఉప్పాడ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే విజయానికి వారధులు

కోటబొమ్మాళి: గృహ సారథులే పార్టీ విజయానికి వారధులని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో కోటబొమ్మాళి 1, 2, కొత్తపేట 1, 2, లఖందిడ్డి 1, 2, జర్జంగి 1, ఎలమంచిలి, దుప్పలపాడు సచివాలయాలకు చెందిన కన్వీనర్లు, గ్రామ సారథులతో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయాత్తం కావాలని సూచించారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ రంజాన్‌రాజు, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, కాల్ల సంజీవరావు, సుంకరి జనార్దన, బమ్మిడి గణపతి, రాంపాత్రుని సావిత్రి, తర్ర కామినాయుడు, అల్లు కల్యాణి, దుక్క అరుణకుమారి, తోట సింహాచలం, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సీదిరి అప్పలరాజు
- గరుడఖండిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పలాస: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గరుడఖండి పంచాయతీ గరుడఖండి, గోపాలపురం, పాత జగదేవపురం, సరియాపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

అనంతరం మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ప్రస్తుతం జరుగుతోందన్నారు. ఉద్దానం ప్రాంత ప్రజలకు అత్యంత అవసరమైన కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయన్నారు. రూ.700 కోట్లతో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని కుళాయిల ద్వారా అందిస్తామని చెప్పారు. అనేక గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్డు, సిమెంటు రోడ్డు సదుపాయాలను ఏర్పాటు చేశామని వివరించారు. పలాసకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకొచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి అన్నివర్గాల ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహసీల్దారు మధుసూదనరావు, నాయకులు ఉంగ సాయికృష్ణ, ఎంఎస్ఆర్ మూర్తి, చింతాడ మాధవరావు, తామాడ మధన్, మద్దిల పాపారావు, సార్ర తిరుపతిరావు, గరుడఖండి సర్పంచి బొత్స రాజేశ్వరి, గొర్లె వేణుగోపాలరావు, హనుమంతు వెంకటరావు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో అన్నివర్గాలకు మేలు

- పిరియా సాయిరాజ్
- బుషాభద్రలో గడప గడపకూ మన ప్రభుత్వం



సోంపేట: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా సాయిరాజ్ తదితరులు

సోంపేట: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని బుషాభద్ర గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. అనునిత్యం ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, బతకల విశ్వనాథం, పల్లి హరిశ్చంద్ర, మద్దిల లచ్చయ్య, గోకర్ల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

కంచిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సాయిరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శిక్షణా సమావేశం, అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మనమంతా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు కొణపల సురేష్, కో–ఆప్షన్ సభ్యుడు అనాది దొళాయి, దుర్గాసి ధర్మారావు, యారడి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు నేడు

సోంపేట: మండల కేంద్రంలోని శైలజా కల్యాణ మండపంలో మండల పరిధిలో ఇటీవల నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సదస్సును మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా బ్యాచ్‌లకు హాజరవ్వాలని కోరారు.

స్పందనకు హాజరవ్వాల్సిందే

- అధికారులపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆగ్రహం



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని, లేకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విద్యుత్ శాఖతో పాటు పలు శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు హాజరవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందనపై అధికారులు సీరియస్‌గా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా స్పందన కార్యక్రమంలో భాగంగా టెక్కలి జగతిమెట్ట వద్ద తనకు ఇంటి స్థలం చూపించారని, పట్టా ఇవ్వకుండా అధికారులు తాత్సారం చేశారని, ఇప్పుడు అదే స్థలంలో మరో వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నారని టెక్కలికి చెందిన బాధ నందిని అనే లబ్ధిదారు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో తక్షణమే పట్టణంలోని ఐదో గ్రామ సచివాలయం వీఆర్వో నాగరాజును పిలిపించి మందలించారు. లబ్ధిదారురాలికి న్యాయం చేయకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇంటి స్థలాలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని టెక్కలి జగతిమెట్ట వద్ద జగనన్న కాలనీలో అసలైన లబ్ధిదారులపై దర్యాప్తు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్‌ను ఆదేశించారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలు

మందస: పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, భేతాళపురం సర్పంచ్ మామిడి సింహాద్రి అన్నారు. మండలంలోని భేతాళపురం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆనల ప్రశాంత్ రైల్వే ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో ఆయనను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ అడతాల మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కూర్మారావు, గుంటు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసు నమోదు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి వద్ద శనివారం రాత్రి జరిగిన ఘటనపై అదే గ్రామానికి చెందిన నలుగురు యువకులపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు సోమవారం తెలియజేశారు. తర్లాగడూరు గ్రామానికి చెందిన అంబటి సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై దాడి చేసిన అక్కుపల్లి గ్రామానికి చెందిన గుంటి ప్రభు, అర్జాల నవీన్, అర్జాల సోను, చొక్కర నవీన్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు.

'మార్పునకు విద్యార్థులు దోహదపడాలి'



మాట్లాడుతున్న వంకల మాధవరావు

కాశీబుగ్గ: సమాజంలో మార్పునకు విద్యార్థులు దోహదపడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు పలాస పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోపిడి, పీడన లేని సమాజానికి విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికుమార్, విజయ్‌కుమార్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరినవారితో మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గరుడభద్ర గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరిని పలాసలోని ప్రగతి భవన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రి సీదిరి అప్పలరాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఎరుపల్లి అప్పారావు, కుర్మారావు, రామచందర్, అర్జి కేశవరావు, టి.నవీన్ తదితరులు ఉన్నారు.

రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎ.దానేష్, గూడ భాస్కరరావు, టి.గణేష్, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● మేమున్నామని...!



వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసిమెలిసి ఆటలాడుకుంటూ కష్ట, సుఖాలను పంచుకున్నారు. పెరిగి పెద్దయ్యాక జీవితాల్లో స్థిరపడ్డారు. పన్నెండేళ్ల తర్వాత మరలా ఒక్కటిగా కలిసిన వారికి ఓ స్నేహితురాలికి కలిగిన ఆపద కలత చెందేలా చేసింది. ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో సోమవారం కలిశారు. అయితే తమతో చదువుకున్న వెంకటరత్నం అనే పూర్వ విద్యార్థిని భర్త ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడని తెలిసింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్నారు. అంతే తక్షణమే స్పందించిన చిన్ననాటి స్నేహితులంతా చేయిచేయి కలిపి పాఠశాల ఆవరణలో రూ.50 వేల నగదుతో పాటు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. పిల్లల చదువుకు భవిష్యత్తులో తమ వంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు.

- ఇచ్ఛాపురం రూరల్

ఉపాధి పనులు ప్రారంభం



కోటబొమ్మాళి: ఉపాధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం గ్రామంలో సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి ఉపాధి పనులను సోమవారం ప్రారంభించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి.తవిటయ్య, కె.సూర్యం, కోదండ, రాము, పంచాయతీ కార్యదర్శి వర్ధన్, వీఆర్వో వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు సర్పంచ్ కాల్ల సంజీవరావు తెలియజేశారు. పెద్ద కొండదిగువు ప్రాంతంలో ఉపాధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయితీ ఈవో యోగేశ్వరరావు, వీఆర్వో అఖిల్ పాల్గొన్నారు.

వలసల నివారణకే ఉపాధి

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి పనులతో గ్రామాల్లో వలసలు నివారించవచ్చని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. మండలంలోని చిన్న బూర్జపాడు గ్రామంలో వరద గట్టు పనులను సోమవారం ప్రారంభించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని, అందరికీ సమాన వేతనాలు అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో పి.శ్రీనివాసరావు, నాయకుడు బుద్ధ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..



సురేష్‌ను సత్కరిస్తున్న మంత్రి అప్పలరాజు తదితరులు

పీసీఎంఏ అధ్యక్షునికి అభినందనలు

కాశీబుగ్గ: పలాస కాష్యూ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్(పీసీఎంఏ) అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మల్లా సురేష్‌కుమార్‌కు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అభినందనలు తెలిపారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం సత్కరించారు. జీడి పరిశ్రమలే పలాసకు ప్రత్యేకమైన ఆకర్షణ అని, మరింత మందికి ఉపాధి కలిగించేలా పనిచేయాలని సూచించారు. కార్యదర్శి కేవీ శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికుమార్‌లను సైతం అభినందించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కంచిలి: మండలంలోని మఠంసరియాపల్లి పంచాయతీ పరిధి పుడాభద్ర గ్రామంలో ఎస్సీ వీధి నుంచి శివాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, వైస్ సర్పంచ్ బుడ్డెపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథం వీవోఏగా పనిచేస్తున్న సీర భారతిపై సర్పంచ్ గణప సింహాచలం కలెక్టర్ స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో స్వయంశక్తి సంఘాల సభ్యులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, పథకాలు వర్తించకుండా చాలా సంఘాలను ఆమె డిఫాల్ట్ చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న తోడు తదితర సంక్షేమ పథకాలకు అనర్హులు అయ్యేలా కార్యకలాపాలు చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న 51 స్వయంశక్తి సంఘాల పరిధిలో సుమారు 600 మంది సభ్యులు గత పదేళ్లుగా ఈమె వ్యవహార శైలితో నష్టపోతున్నారని వివరించారు. వీవోఏపై సమగ్ర దర్యాప్తు జరిపించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

యాదవులకు సముచిత స్థానం



పిరియా సాయిరాజ్‌ను సత్కరిస్తున్న యాదవ సామాజిక వర్గం నేతలు

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాదవులకు సముచిత స్థానం లభిస్తోందని ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ను ఆయన నివాసంలో సోమవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో యాదవులకు గౌరవం, హోదా సాయిరాజ్‌తో సాకారమయ్యాయన్నారు. ఇచ్ఛాపురం ఏఎంసీ వైస్ చైర్మన్‌గా యలమంచి నీలయ్య, కంచిలి ఏఎంసీ చైర్మన్‌గా బతకల మోహనరావు, కంచిలి పీఏసీఎస్ చైర్మన్‌గా గుమ్మడి రాందాస్, కంచిలిలో తొలి పర్యాయంలో పీఏసీఎస్ చైర్మన్‌గా దుర్గాశి ధర్మారావు, ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉలాల భారతీదివ్య, కవిటి మండల పార్టీ కన్వీనర్‌గా కడియాల ప్రకాష్, కంచిలి మండల వైస్ ఎంపీపీగా పాలిన కామాక్షి తదితరులు వివిధ హోదాల్లో ఉన్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో యాదవులకు పదవులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం నేతలు దట్టి అజయ్, బతకల మోహనరావు, బతకల మోహన్‌దాస్, బద్రి ప్రకాష్, బదకల భాస్కరరావు, యలమంచి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వజ్రపుకొత్తూరు: ధాన్యం కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు తమ్మినేని భాస్కరరావు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నగరంపల్లి గ్రామానికి చెందిన రైతులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు ధాన్యం అమ్ముడుపోక తీవ్ర అవస్థలు పడుతున్నారని తహసీల్దార్ బి.అప్పలస్వామికి వినతి పత్రం అందించారు. పంచాయతీలో ఇప్పటివరకు 60 శాతం ధాన్యాన్ని మాత్రమే అధికారులు సేకరించారని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, భానుమతి, చెల్లయ్య, బి.ఆనందరావు, రుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బడ్జెట్‌లోని వివిధ అంశాలపై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వీకే ప్రసాద్, అట్టాడ రవిబాబ్జి, ఉమామహేశ్వరరావు, పూడి తిరుపతిరావు, లక్ష్మీ, సాలిన ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.